సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 22 । ఆగస్టు । 2023



ఘనంగా నాగుల పంచమి

జిల్లా వ్యాప్తంగా సోమవారం నాగుల పంచమిని మహిళలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలు, పుట్టలో పాలుపోసి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. 9లో▸



బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

అధికార బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులను ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు జిల్లాలో సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /25.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ చిరుజల్లుల పడవచ్చు, పడమర దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

పాత బలగమే..

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఖరారు
- మరోసారి సిట్టింగ్‌లకే అవకాశం
- మూడు చోట్లా మార్పుల్లేవు..
- ఊహాగానాలు, ప్రచారాలకు తెర
- మళ్లీ గెలుస్తామని అభ్యర్థుల ధీమా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారయ్యారు. అనేక ఊహాగానాలు, ప్రచారాలకు తెరదించుతూ సిట్టింగ్ ఎమ్మెల్యేలపైనే నమ్మకం ఉంచి పార్టీ అధినేత కేసీఆర్ మరోసారి అవకాశం కల్పించారు. పాత వారు ముగ్గురికీ పార్టీ టికెట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో పాత బలగంతోనే ఎన్నికల బరిలోకి దిగి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

మంచిర్యాల మళ్లీ 'నడిపెల్లి'కే..


జిల్లా కేంద్రం, కీలకమైన జనరల్ స్థానం నుంచి అనేకమంది పార్టీ టికెట్ ఆశించారు. కానీ గులాబీ అధినేత సిట్టింగ్ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు వైపే మొగ్గు చూపారు. గత కొంతకాలంగా ఆయనకు వ్యతిరేకంగా పార్టీలో ఓ వర్గం ఏర్పడినప్పటికీ మరోసారి ఆయనకే అవకాశం వరించింది. ఇప్పటికే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన ఐదోసారి వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగనున్నారు. 1981లో మంచిర్యాల మున్సిపల్ కౌన్సిలర్‌గా ఆయన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1987లో మంచిర్యాల సింగిల్ విండో చైర్మన్‌గా, 1982నుంచి 1999వరకు బ్లాక్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పని చేశారు. వివిధ పదవులు చేపట్టారు. 1999 నుంచి 2009 వరకు రెండుసార్లు అప్పటి లక్సెట్టిపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా లక్సెట్టిపేట మంచిర్యాలగా ఏర్పడింది. 2014లో కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లోనూ టీఆర్ఎస్ పార్టీ నుంచే మరోసారి టికెట్‌ను పొంది ఎమ్మెల్యే అయ్యారు. దీంతో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్నారు.

బెల్లంపల్లి చిన్నయ్యకే..

జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపైనే అధినేత పూర్తి నమ్మక ఉంచారు. ఇటీవల ఆయనపై జరుగుతున్న ప్రచారం, ఆరిజిన్ డెయిరీ వ్యవహారంలో జరిగిన ఘటనల నేపథ్యంలోనూ అభ్యర్థిగా ప్రకటించడం గమనార్హం. టీడీపీ ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన 1995లో నెన్నెల జెడ్పీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. 2001లో బంగాల్‌పేట్ ఎంపీటీసీగా గెలుపొంది నెన్నెల ఎంపీపీ అయ్యారు. 2009లో టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరి 2011లో ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2014లో బీఆర్ఎస్ తరఫున చిత్తాపూర్ ఎంపీటీసీగా గెలుపొందారు. 2014లో అనూహ్యంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లోనూ అదే పార్టీ నుంచి విజయం సాధించారు. మూడోసారి పోటీకి టికెట్ దక్కించుకుని తనకున్న పట్టును నిలబెట్టుకున్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నా పట్టుదలతో ఛేదించుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు.

బాల్క సుమన్‌కు రెండోసారి..

చెన్నూరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసే అవకాశం దక్కింది. 2001లో టీఆర్ఎస్‌లో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన 2014వరకు తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 2007లో ఓయూ టీఆర్ఎస్వీ అధ్యక్షుడిగా, 2010లో టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసి ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేకానందపై ఘన విజయం సాధించారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ నియోజకవర్గం నుంచి మొదటిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు. తాజాగా మరోసారి టికెట్ వరించడంతో కేసీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యంతో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే కీలకంగా ఉంటారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెన్నూర్ అభ్యర్థి బాల్క సుమన్

అధినేత నమ్మకాన్ని వమ్ము చేయను

- రూ.500 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి
- చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా తనపై నమ్మకంతో రెండోసారి టిక్కెట్ ఇచ్చిన బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుపొందుతానని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. రెండోసారి పార్టీ టిక్కెట్ వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వెంట నడిచానని అన్నారు. పెద్దపల్లి ఎంపీగా గెలుపొందడంతో 2018లో చెన్నూర్ అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో రూ.500 కోట్ల నిధులతో అభివృద్ధి చేశానని చెప్పారు. గత ఐదేళ్లలో చెన్నూర్ నియోజకవర్గ రూపురేఖలు మారి పోయాయని తెలిపారు. రూ.1658 కోట్లతో చెన్నూర్ ఎత్తిపోతల పథకం, రూ.500 కోట్లతో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సింగరేణిలో నివాసం ఉంటున్న నాలుగు వేల మందికి ఇళ్లపట్టాలు, 1200 ఎకరాల పోడు భూముల పట్టాలు అందజేశామని తెలిపారు. గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలి డబ్బు సంపాదనే లక్ష్యంగా పని చేశారని తెలిపారు. మరోసారి బీఆర్ఎస్‌కు పట్టంకడితే కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి యజ్ఞం ఇదే విధంగా కొనసాగుతుందని అన్నారు. ప్రజలు ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలు నమ్మకుండా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నమ్మకంతో అవకాశం ఇచ్చారు..



నాపై ఉన్న నమ్మకంతో సీఎం కేసీఆర్ బెల్లంపల్లి టికెట్ ఇచ్చారు. నాపై ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు మా వైపే ఉన్నారు. అదే నమ్మకంతో నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసి, నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం. వచ్చే ఎన్నికల్లో 50వేల మెజార్టీతో గెలుస్తాననే నమ్మకం ఉంది.

– దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్యే, బెల్లంపల్లి

కేసీఆర్‌కు కృతజ్ఞతలు



మాపై నమ్మకంతో మారోసారి టికెట్ ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు, నాపై నమ్మకం ఉంచిన నియోజకవర్గ ఓటర్లు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. మంచిర్యాలలో ప్రశాంతత నెలకొల్పేడమే నా ప్రధాన ధ్యేయం. నా జీవితంలో ఎవరిపైనా ఈర్శ్య, పగ, కోపాలు ఉండవు. 'మంచి' మంచిర్యాలను కాపాడుకుందాం. మరోసారి ఇక్కడి ప్రజలు తమ పవిత్ర ఓటుతో నన్ను గెలిపించడమే కాక సీఎం కేసీఆర్ మారోసారి ముఖ్యమంత్రి అవుతారనే దృఢమైన విశ్వాసం ఉంది.

– నడిపెల్లి దివాకర్‌రావు, ఎమ్మెల్యే, మంచిర్యాల

న్యూస్‌రీల్

ఆర్డీవో కార్యాలయం డీఏఓగా శ్రీనివాసరావు దేశ్‌పాండే



డీఏవో శ్రీనివాసరావు దేశ్‌పాండే

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి(డీఏఓ)గా శ్రీనివాసరావు దేశ్‌పాండే నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ డీఏఓగా విధులు నిర్వర్తిస్తున్న మధుసూదన్‌ను కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా బదిలీ చేయగా, ఆక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న శ్రీనివాసరావు దేశ్‌పాండేను ఇక్కడ డీఏఓగా నియమించారు. ఆర్డీవో కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'ఎమ్మెల్యే టికెట్ బీసీలకే కేటాయించాలి'



మాట్లాడుతున్న గాజుల ముఖేష్‌గౌడ్

పాతమంచిర్యాల: మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్‌ను బీసీలకు కేటాయించాలని రాజ్యాధికార బీసీ బహుజన ఐక్యవేదిక నాయకులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో మంచిర్యాల టికెట్ ఆశిస్తున్న బీసీ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ, ప్రాంతీయ పార్టీలు జనరల్ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని తీర్మానం చేశారు. ఎమ్మెల్యే టికెట్‌ను అగ్రకులాల వారికి కేటాయించడంతో బీసీలు చట్టసభలకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. రాజకీయ పార్టీలు సమన్యాయం పాటించాలని విజ్ఞప్తి చేశారు. బీసీల ఉనికిని చాటడానికి జిల్లా కేంద్రంలో బుధవారం బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాసంఘాలు, విద్యార్థిసంఘాలు, న్యాయవాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార బీసీ బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు చుంచు రాజ్‌కిరణ్, కార్యదర్శి బెల్లంకొండ మురళీధర్, ఉపాధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్, గౌరవ సలహాదారు కర్రె లచ్చన్న, సోషల్ మీడియా ఇంచార్జి చంద్రమోహన్‌గౌడ్, బీసీ నాయకులు డాక్టర్ రమణ, డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, తోట శ్రీనివాస్, ఆశాలత, అత్తి సరోజ, ముత్తే సత్తయ్య, ఏ.తిరుపతివర్మ, నీలి శ్రీనివాస్, గాజుల ముఖేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి దండేపల్లి ఎంపీపీ

దండేపల్లి: దండేపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అధికార బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికకు రంగం సిద్ధమైంది. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు హైదరాబాద్‌కు వెళ్లిన ఆయన ప్రేంసాగర్‌రావుతో కలిసి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలను కలువనున్నట్లు ఎంపీపీ వర్గీయులు పేర్కొన్నారు. మంగళ, బుధవారాల్లో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. అధికార పార్టీకి చెందిన ఎంపీపీ పార్టీని వీడడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. కొన్నాళ్లుగా ఎమ్మెల్యేతో దూరంగా ఉంటున్న ఆయన పలు కార్యక్రమాలకు డుమ్మాకొట్టారు. దీంతో అప్పట్లోనే పార్టీ మారతారనే ప్రచారం జరిగింది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో మాట్లాడి నచ్చజెప్పారు. మళ్లీ నెల రోజులుగా పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మళ్లీ ఎమ్మెల్యే ఎంపీపీతో మాట్లాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఈ విషయమై ఎంపీపీ గడ్డం శ్రీనివాస్‌ను సంప్రదించగా తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నది నిజమేనని తెలిపారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు తనకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం, మండల అభివృద్ధికి సహకరించకపోవడం వల్ల పార్టీని వీడుతున్నట్లు తెలిపారు.

బోదకాలు నివారణ మాత్రల పంపిణీ పరిశీలన



పరిశీలిస్తున్న జిల్లా తనిఖీ బృందం

భీమారం: బోదకాలు నివారణ కోసం మండలంలో చేపట్టిన మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తనిఖీ బృందం అధికారులు అల్లాడి రాజ్‌కుమార్, నాందేవ్ పరిశీలించారు. ఆశావర్కర్లు ప్రజలతో మాత్రలు మింగించే తీరుని చూశారు. ఇంటిగోడపై రాతతోపాటు లబ్ధిదారు ఎడమచేతి చిటికెన వేలిపై మార్కు వేస్తున్నారా లేదా ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రతీ ఒక్కరికి మాత్రలు పంచకుండా అందరితో మింగించాలని సిబ్బందిని ఆదేశించారు. రెండేళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి మింగించి భవిష్యత్ తరాలకు బోదకాలు వ్యాప్తి చెందకుండా చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య పర్యవేక్షకులు రమాదేవి, సిబ్బంది హర్షిణి, ఉమాదేవి పాల్గొన్నారు.

బెటాలియన్‌లో డీఐజీ పర్యటన



బెటాలియన్‌లో మొక్క నాటుతున్న డీఐజీ సిద్దిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌ను సోమవారం బెటాలియన్‌ల డీఐజీ సిద్దిఖీ సందర్శించారు. కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బంది ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వచ్చిన డీఐజీ సిద్దిఖీ బెటాలియన్ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి పర్యవేక్షించారు. పరిపాలన ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి మినిస్టీరియల్‌లోని విభాగాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా మంగళవారం పరేడ్ మైదానం, బెటాలియన్, మినిస్టీరియల్ సిబ్బందితో కలిసి దర్బార్ పరేడ్ ఉంటుందని కమాండెంట్ తెలిపారు.

విద్యావిధానంలో మార్పులకు హెచ్ఎంలదే బాధ్యత

మంచిర్యాలఅర్బన్: విద్యావిధానంలో వస్తున్న నూతన మార్పులను తరగతి గదులకు చేరవేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని డీఈవో యాదయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో తొమ్మిది మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాల్‌లతో మూడు రోజుల ఉన్నతి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమం అద్భుతమైన ఫలితాలను ప్రేరణగా తీసుకుని కొనసాగింపుగా 6 నుంచి 9వ తరగతిలకు అభ్యసన అభివృద్ధి, ఉన్నతిని తీసుకొచ్చిందని తెలిపారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తరగతి, సబ్జెక్టు వారి విద్యాప్రమాణాలు సాధించటానికి అభ్యసన ఫలితాలు కొలమానంగా పరిగణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సత్యనారాయణమూర్తి, ట్రైనర్లు మల్లేశం, సాంబమూర్తి పాల్గొన్నారు.

5,90,620

జిల్లా ఓటర్లు



- ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా ఓటరు జాబితా 2వ సవరణ–2023లో భాగంగా ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఈ మేరకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ముసాయిదా జాబితాపై సెప్టెంబర్ 9వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 28న ఫిర్యాదులు, అభ్యంతరాలు పరిష్కరిస్తారు. ఎన్నికల సంఘానికి అనుమతి తర్వాత అక్టోబర్ 4న తుది జాబితా విడుదల చేస్తారు. నూతన ఓటరు నమోదు కోసం ఫారం–6 వినియోగించాలని, ఫారం–7 ద్వారా ఓటరు జబితాలో పేరు తొలగింపు, మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఫారం–7తో జత చేయాల్సి ఉంటుందని, ఫారం–8 ద్వారా ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో నివాసం మార్పు, నమోదు చేసిన వివరాల సవరణ, నూతన ఓటరు ఫొటో గుర్తింపు కార్డు జారీ కోసం వైకల్యం ఉన్న వ్యక్తిగా/ఓటరుగా గుర్తించడానికి అభ్యర్థన వంటి అంశాలకు వినియోగించాలని తెలిపారు. ఫారం–6 బీ ద్వారా ప్రస్తుతం ఓటరుగా నమోదైన వారు ఓటరు జాబితాలో పేరు నమోదును ధ్రువీకరించుకోవడానికి ఆధార్ నంబర్‌ను తెలియజేయాలని తెలిపారు. ఫారం 6, 7, 8 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఎన్నికల సంఘానికి, ఓటర్ల నమోదు అధికారికి సమర్పించాలని తెలిపారు.

పెరిగిన ఓటర్లు..

ఓటరు జబితాలో తప్పొప్పుల సవరణ, మృతుల పేర్ల తొలగింపు, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా, పొరపాట్లు లేకుండా పూర్తి చేసేందుకు ఇంటింటి సర్వే నిర్వహించి పారదర్శకంగా జాబితా తయారు చేశారు. మృతులు, బోగస్ ఓటర్లను తొలగించారు. దీంతోపాటుగా ఇటీవల కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లు పెరిగారు. గతంలో చెన్నూర్ నియోజకవర్గంలో 1,76,973 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 1,77,761 మందికి చేరారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో 1,62,069 మంది ఉండగా 1,61,908 మంది ఉన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో 2,50,790 మంది ఉండగా 2,50,458 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మొత్తం 5,87,202 ఉంటే ప్రస్తుతం 5,90,620 మందికి చేరింది.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్లు	సర్వీసు/ ఎన్ఆర్ఐ	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
చెన్నూర్	89,176	88,443	9	133	1,77,761	227
బెల్లంపల్లి	81,345	80,550	13	161	1,62,069	227
మంచిర్యాల	1,25,609	1,24,829	20	332	2,50,790	287
మొత్తం	2,96,130	2,93,822	42	626	5,90,620	741

లక్కీగా టెండర్ దక్కింది..!



లైసెన్స్ పత్రం అందజేస్తున్న కలెక్టర్ సంతోష్



హాజరైన మద్యం వ్యాపారులు

- ప్రశాంతంగా ముగిసిన మద్యం దుకాణాల డ్రా
- లబ్ధిదారులతో మంతనాలు
- సర్కారుకు రూ.6.88కోట్లు ఆదాయం

మంచిర్యాలక్రైం: 2023–25 సంవత్సరానికి గాను కొత్త మద్యం పాలసీ ప్రారంభానికి సోమవారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 73 దుకాణాలకు గాను ఈ నెల 4నుంచి 18వరకు 2,242 టెండర్లు దాఖలయ్యాయి. ఇందులో 398 మంది మహిళలు టెండర్లు దాఖలు చేశారు. లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎన్నికల ఏడాది కావడంతో లాభాలు ఎక్కువ వచ్చే అవకాశం ఉందని చాలామంది కొత్తవారు టెండర్లు దాఖలు చేశారు. ఓ గ్రూప్‌నకు చెందిన కొందరు ఏకంగా వంద టెండర్లు దాఖలు చేయగా ఒక్కటే దుకాణం దక్కింది. ఆ ఒక్క దుకాణమైనా దక్కడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇలా 2,242మందికి 73మందిని అదృష్టం వరించింది. వీరిలో 15మంది మహిళలు దుకాణాలు దక్కించుకున్నారు. కొందరికి టెండర్ రాకపోవడంతో కొత్తగా మద్యం వ్యాపారంలోకి వచ్చిన వారికి గుడ్‌విల్ ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఎన్నికలు రావడంతో డ్రాలో ఎంపికైన వారే దుకాణాల నిర్వహణకు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో అత్యంత డిమాండ్ ఉన్న గెజిట్ షాపు నంబర్ 1 ఇందారం మద్యం దుకాణం జీ.బాలమణి అనే మహిళకు లక్కీ డ్రాలో దక్కింది.

రూ.51.72కోట్లు ఆదాయం

ఈసారి దరఖాస్తుల రూపంలో లక్కీ డ్రా పూర్తయిన తర్వాత ఎంపికైన లబ్ధిదారులు మొదటి దఫా చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు రూ.6.88కోట్లు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. జిల్లా వ్యాప్తంగా 73 మద్యం దుకాణాలకు గాను 2242 దరఖాస్తులు రాగా ఫీజు రూపంలో రూ.44.84కోట్లు వచ్చాయి. లైసెన్స్ ఫీజు, దరఖాస్తుల రుసుం కలిపి రూ.51.72కోట్లు ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కేజీ నందగోపాల్, స్థానిక సీఐ నరేందర్, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కారానికి కృషి చేస్తున్నామని అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ తెలిపారు. ఆయా విభాగాలకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేషాద్రి, బెల్లంపల్లి ఆర్డీవో సురేష్‌లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూర్ బస్‌డిపోలో భూమిని కోల్పోతున్న తమకు మరోచోట భూమిని తహసీల్దార్ చూపించారని, ఆ భూమికిలోకి వెళ్తే కొందరు బెదిరిస్తున్నారని చెన్నూర్ మండలానికి చెందిన బోగే మల్లేశ్వరి ఫిర్యాదు చేసింది. దివ్యాంగులమైన తాము పింఛన్‌తో జీవనం సాగిస్తున్నామని, తమకు ఇల్లు ఇప్పించాలని మంచిర్యాలలోని కాలేజీ రోడ్డుకు చెందిన నడిమెట్ల తిరుపతి, రాజేశ్వరి దంపతులు కోరారు. భూమి ఇప్పించాలని మందమర్రికి చెందిన క్రీడాకారుడు పఠాన్ జమీల్‌ఖాన్, శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని శ్రీరాంపూర్‌కు చెందిన నిరుద్యోగ యువకులు శ్రీపల్లిరాజు, కే.శ్రీను, దుర్గం రఘుకుమార్, కే.శ్రావణ్, సాగర్, వంశీ వినతిపత్రం సమర్పించారు.




దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

బుగ్గలో కర్ణాటక ఎమ్మెల్యే పూజలు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ శివారులోని బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో కర్ణాటక రాష్ట్రం సులియా నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే భగీరథ మురుల్యా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, మాజీ ఎమ్మెల్యే ఎ.శ్రీదేవి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూప, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి..

దండేపల్లి: వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని మహారాష్ట్రలోని ఔసా ఎమ్మెల్యే అభిమన్యు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని గూడెం సత్యనారాయణస్వామిని పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌తో కలిసి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం దండేపల్లిలో బీజేపీ మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, మండల ఇంచార్జి గుండ ప్రభాకర్, ఉపసర్పంచ్‌లు సత్తయ్య, వెంకటేష్, నాయకులు రవిగౌడ్, శేఖర్, నరేష్, కిషన్, మల్లేష్, అనిల్, రాకేష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అభిమన్యు, పక్కన రఘునాథ్

సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



రాస్తారోకో చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

పాతమంచిర్యాల: సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్ఎంల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. రెగ్యులరైజ్ చేసేది లేదని హెల్త్ డైరెక్టర్ చెప్పడం సరికాదని తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణ కోసం పని చేస్తున్న తమ సేవలను గుర్తించకుండా కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమని తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల, సెకండ్ ఏఎన్ఎంలు కవిత, తులసి, రాజేశ్వరీ, శ్రీలత, వినోద, సుజాత, మాధవి, శైలజ, స్వప్న, వసంత, ఆదిలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, కార్యదర్శి రంజిత్ పాల్గొన్నారు.


గులాబీ గెలుపు గుర్రాలు వీరే..

- బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్‌
- జిల్లాలో ముగ్గురు సిట్టింగ్‌లకు దక్కని టికెట్‌ • అభ్యర్థుల నేపథ్యం ఇదీ..

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో బీఆర్‌ఎస్‌ దూకుడు పెంచింది. అందరికంటే ముందుగానే పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌ అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ముగ్గురు సిట్టింగులకు చాన్స్‌ దక్కలేదు. వారిస్థానంలో కొత్తవారికి టికెట్‌ ఇచ్చారు. నియోజకవర్గాల వారీగా మొత్తం పది మంది అభ్యర్థుల రాజకీయ నేపథ్యం ఇలా ఉంది..

నిర్మల్‌ నియోజకవర్గం





పేరు : అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
తల్లిదండ్రులు : నారాయణరెడ్డి, చిన్నమ్మ
భార్య : విజయలక్ష్మి
కూతురు, అల్లుడు : పల్లవిరెడ్డి, రంజిత్‌రెడ్డి
కుమారుడు, కోడలు : గౌతమ్‌రెడ్డి, దివ్యారెడ్డి
పుట్టినతేదీ : 16–02–1949
విద్యార్హత : బీకాం, ఎల్‌ఎల్‌బీ
రాజకీయ ప్రస్థానం

- 1987లో జరిగిన పరిషత్‌ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా పరిషత్‌ చైర్మన్‌గా వ్యవహరించారు.
- 1991లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 1999, 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 2008 పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి 2009 వరకు ఆదిలాబాద్‌ ఎంపీగా ఉన్నారు.
- 2014లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా గెలిచి సెప్టెంబర్‌ వరకు రాష్ట్ర గృహనిర్మాణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రిగా కొనసాగారు.
- 2018నుంచి రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

ఆసిఫాబాద్‌ నియోజకవర్గం






పేరు : కోవ లక్ష్మి
భర్త : సోనేరావ్‌
తండ్రి : కోట్నాక్‌ భీంరావ్‌ (గిరిజన సంక్షేమశాఖ మాజీమంత్రి)
తల్లి : భీంబాయి
కులం : ఎస్టీ(గోండు)
పుట్టిన తేదీ : 6–2–1969
విద్యార్హత : పదోతరగతి
సంతానం : కుమార్తెలు అరుణ (సిర్పూర్‌(యూ) జెడ్పీటీసీ, మాన్విత, కుమారుడు సాయినాథ్‌
రాజకీయ ప్రస్థానం : 1995, 2001లో తిర్యాణి మండలం పంగిడిమాదర నుంచి ఎంపీటీసీ
2002 : తిర్యాణి ఎంపీపీగా
2006 ఆసిఫాబాద్‌ సర్పంచ్‌
2010 : టీఆర్‌ఎస్‌(ప్రస్తుత బీఆర్‌ఎస్‌)లో చేరిక
2013 : రెండోసారి ఆసిఫాబాద్‌ సర్పంచ్‌గా ఎన్నిక
2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్‌ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
2018 : ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు.
2019 : జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక

సిర్పూర్‌(టి) నియోజకవర్గం





పేరు : కోనేరు కోనప్ప
తల్లిదండ్రులు : సూర్య నారాయణ, కృష్ణవేణి
కులం : ఓసీ (కమ్మ)
పుట్టిన తేదీ : 07–10–1955
విద్యార్హత: ఇంటర్‌
భార్య: రమాదేవి
పిల్లలు : కూతురు ప్రతిమ, కుమారుడు వంశీకృష్ణ
నివాసం : గుంటూరు కాలనీ, కాగజ్‌ నగర్‌
రాజకీయ ప్రస్థానం :
1999 : కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.
2004 : కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.
2009 : కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
2014 : బీఎస్పీ నుంచి గెలుపుపొంది టీఆర్‌ఎస్‌లో చేరారు.
2018 : టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.

చెన్నూర్‌ నియోజకవర్గం





పేరు: బాల్క సుమన్‌
తల్లిదండ్రులు: బాల్క సురేశ్‌, ముత్తమ్మ
కులం: మాల
పుట్టినతేదీ: 18–10–1983
భార్య : రాణి అలేఖ్య
కుమారులు : సుహాన్‌, సుషన్‌
స్వస్థలం : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం, రేగుంట
విద్యాభ్యాసం: డిగ్రీ
రాజకీయ ప్రస్థానం :

- 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. 2007లో టీఆర్‌ఎస్వీ ఓయూ అధ్యక్షుడిగా, 2010లో టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2009 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు.
- 2014లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి టీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ప్రత్యర్థి కాంగ్రెస్‌ అభ్యర్థి గడ్డం వివేకానందపై 2.91 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్‌ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్‌ అభ్యర్థి బోర్లకుంట వెంకటేశ్‌ నేతపై 28,132 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుతం చెన్నూర్‌ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు.

బెల్లంపల్లి నియోజకవర్గం





పేరు: దుర్గం చిన్నయ్య
తల్లిదండ్రులు: దుర్గం రాజయ్య, మల్లక్క
భార్య:జయతార
సంతానం: ఇద్దరు కూతుర్లు (నిహారిక , విహారిక)
కులం: ఎస్సీ (నేతకాని)
పుట్టినతేదీ: 31–05–1972
విద్యార్హత: డిగ్రీ, బీఏ
స్వస్థలం: జెండా వెంకటాపూర్‌, నెన్నెల (మం) వృత్తి:వ్యవసాయం
నివాసం: మంచిర్యాల
రాజకీయ ప్రస్థానం

- 1995 లో టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా రాజకీయ రంగప్రవేశం.
- 1995 లో నెన్నెల జెడ్పీటీసీగా టీడీపీ నుండి పోటీచేసి విజయం సాధించారు.
- 2001లో టీడీపీ నుండి జంగాల్‌పేట్‌ ఎంపీటీసీగా గెలిచి నెన్నెల ఎంపీపీగా గెలిచారు.
- 2009 లో టీఆర్‌ఎస్‌లో చేరిక
- 2011లో బీఆర్‌ఎస్‌ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.
- 2014 లో చిత్తాపూర్‌ ఎంపీటీసీగా టీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి బెల్లంపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

ముధోల్‌ నియోజకవర్గం





పేరు : గడ్డిగారి విఠల్‌రెడ్డి
తల్లిదండ్రులు : గడ్డెన్న, రాజమ్మ
పుట్టినతేదీ : 06–08–1954
పుట్టిన ఊరు : దేగాం, భైంసా మండలం
విద్యార్హత : బీఏ, ఎల్‌ఎల్‌బీ
భార్య : గడ్డిగారి లక్ష్మి
కూతురు, అల్లుడు : సులోచన, శ్రీనివాస్‌రెడ్డి
కుమారుడు, కోడలు : రాంరెడ్డి, అక్షయ
రాజకీయ ప్రస్థానం

- 2006 నుంచి 2008 వరకు భైంసా మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా చేశారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పీఆర్పీ నుంచి పోటీ చేసి కేవలం 183 ఓట్లతో ఓడిపోయారు.
- 2010 నుంచి 13వరకు మరోసారి భైంసా మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా చేశారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 2014 ఆగస్టు 6న బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి రెండోసారి బంపర్‌ మెజార్టీతో గెలిచారు.

మంచిర్యాల నియోజకవర్గం





పేరు : నడిపెల్లి దివాకర్‌రావు
తల్లిదండ్రులు: రమాదేవి, లక్ష్మణ్‌రావు
భార్య: రాజకుమారి
కుమారులు: రంజిత్‌, విజిత్‌కుమార్‌
స్వస్థలం: పాతమంచిర్యాల
పుట్టినతేదీ : 15 ఆగస్టు, 1952
విద్యార్హత : బీఏ(పొలిటికల్‌ సైన్స్‌)

- 1981లో మంచిర్యాల మున్సిపల్‌ కౌన్సిలర్‌
- 1987లో మంచిర్యాల సింగిల్‌ విండో చైర్మన్‌
- 1982–1992 వరకు మంచిర్యాల బ్లాక్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి
- 1999 వరకు బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా పనిచేశారు
- 1999 అసెంబ్లీ ఎన్నికల్లో లక్సెట్టిపేట నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.
- 2015 నుంచి 2018 వరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ అండర్‌ టేకింగ్స్‌ కమిటీ చైర్మన్‌గా కొనసాగారు.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి టీఆర్‌ఎస్‌ నుంచే పోటీచేసి విజయం సాధించారు.

ఆదిలాబాద్‌ నియోజకవర్గం





పేరు :జోగు రామన్న
తల్లిదండ్రులు: జోగు ఆశన్న, భోజమ్మ
భార్య : రమ
కుమారులు : ప్రేమేందర్‌, మహేందర్‌
స్వగ్రామం : దీపాయిగూడ, జైనథ్‌ మండలం
విద్యార్హత : బీఏ
రాజకీయ ప్రస్థానం..

- 1984లో టీడీపీలో చేరిక
- 1988 నుంచి 1995 వరకు దీపాయిగూడ సర్పంచ్‌గా, మండల పరిషత్‌ ఉపాధ్యక్షునిగా పనిచేశారు.
- 1995 నుంచి 2001 వరకు జైనథ్‌ ఎంపీపీగా..
- 2001 నుంచి 2009 వరకు జైనథ్‌ జెడ్పీటీసీగా
- 2004 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి ఓడిపోయారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2010లో తెలంగాణ నగారా సమితిలో చేరిక
- 2011లో టీఆర్‌ఎస్‌లో చేరి 2012 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు.
- 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరించారు.
- 2019 సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

బోథ్‌ నియోజకవర్గం





పేరు : అనిల్‌జాదవ్‌
తల్లిదండ్రులు : యశోద, జాదవ్‌ రామారావు
భార్య : హరిప్రియ
కూమారులు :ఆర్యన్‌, అర్జున్‌
పుట్టినతేదీ : 16–06–1972
స్వస్థలం: రాజురా
మండలం: నేరడిగొండ
నియోజకవర్గం: బోథ్‌ (ఎస్టీ)
విద్యార్హతలు :బీఏ, పొలిటికల్‌ సైన్స్‌
రాజకీయ ప్రస్థానం:

- 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక, 2004 ఎన్నికల లో టికెట్‌ ఆశించారు. చివరి నిమిషంలో సోయం బాపురావు పార్టీలో చేరి టికెట్‌ దక్కించుకోవడంతో టీఆర్‌ఎస్‌ పార్టీలో ఉండి 'సోయం' గెలుపు కోసం కృషి చేశారు.
- 2007 లో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు.
- 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.
- 2018లో ఇండిపెండెంట్‌గా అభ్యర్థిగా పోటీ
- 2019 మార్చి 21న బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2019లో జరిగిన పరిషత్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి నేరడిగొండ జెడ్పీటీసీగా విజయం సాధించారు.

ఖానాపూర్‌ నియోజకవర్గం





పేరు : భూక్య జాన్సన్‌ నాయక్‌
తల్లిదండ్రులు : భూక్య శామ్యూల్‌నాయక్‌, కేస్లీబాయి
పుట్టినతేదీ : 06–06–1976
భార్య : జయలక్ష్మి
సంతానం : కుమారుడు
విద్యార్హత : జెనిటిక్స్‌లో డిగ్రీ, కంప్యూటర్‌ అప్లికేషన్స్‌లో పీజీ డిప్లొమా
పుట్టిన ఊరు: తిమ్మాపూర్‌ తండా, మం.ఇబ్రహీంపట్నం, జి.జగిత్యాల
రాజకీయ ప్రస్థానం
2009లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు.
2014లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంపీ టికెట్‌కోసం ప్రయత్నాలు చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరు

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

రామకృష్ణాపూర్‌(చెన్నూర్‌): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ రాజీలేని పోరాటాలు సాగిస్తోందని ఆ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. పట్టణంలోని యూనియన్‌ కార్యాలయంలో సోమవారం ఏఐటీయూసీ బ్రాంచి 12వ మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసే కేంద్రం కుట్రలను అడ్డుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రైవేటీకరణ బారి నుండి సింగరేణిని కాపాడుకునేందుకు ఏఐటీయూసీ ఎలాంటి పోరుకైనా సిద్ధమన్నారు. కార్మికుల పక్షాన అనేక ఉద్యమాలు సాగించిన యూనియన్‌ కేవలం ఏఐటీయూసీనేనని రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు తమ సంఘం పక్షాన అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25 నుండి 27 వరకు గోదావరిఖనిలో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు కలవేన శంకర్‌, జిల్లా, పట్టణ కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్‌, మిట్టపెల్లి శ్రీనివాస్‌, యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

బ్రాంచి నూతన కమిటీ ఎన్నిక

ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడిగా ఇప్పకాయల లింగయ్య, కార్యదర్శిగా ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా సురమల్ల వినయ్‌, కోశాధికారిగా పుష్పరాజ్‌, మైనింగ్‌ స్టాఫ్‌ ఇన్‌చార్జిగా రాజేశ్వర్‌రావును ఎన్నుకున్నారు.

సింగరేణిలో కొత్త భూగర్భ గనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

బెల్లంపల్లి: సింగరేణిలో కొత్తగా భూగర్భ గనులను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు, బెల్లంపల్లి బ్రాంచ్‌ కార్యదర్శి దాగం మల్లేశ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త గనులకోసం ఏఐటీయూసీ పోరాడుతుందన్నారు. బెల్లంపల్లి బ్రాంచ్‌ 16వ మహాసభలో కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు చిప్ప నర్సయ్య, బియ్యాల వెంకటస్వామి, నాగేశ్వర్‌రావు, మీనుగు లక్ష్మీనారాయణ, దాసరి శ్రీధర్‌, మంతెన రమేశ్‌, బోస్‌, గొల్ల శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బైక్‌ దొంగల అరెస్టు



అరెస్టు చూపిస్తున్న ఎస్సై మధుకర్‌

కౌటాల(సిర్పూర్‌): ఆరుబయట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను అపహరించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై మధుకర్‌ తెలిపారు. ఈ నెల 20న దీపెన్‌ మండల్‌ అనే పెయింటర్‌ తన మోటర్‌ సైకిల్‌ చోరీకి గురైనట్లు కౌటాల పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం కౌటాల మినీ స్టేడియం ఎదుట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రలోని మర్పల్లి గ్రామానికి చెందిన జాడె రోహన్‌ లక్ష్మణ్‌, సిర్పూర్‌(టి) మండలంలోని కర్జపల్లి గ్రామానికి చెందిన మౌల్కర్‌ సుకుదేవ్‌లను గుర్తించి వారి వద్ద నుంచి మూడు మోటార్‌ సైకిళ్లను రికవరీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పోలీసుల దృష్టికి 'రూ. వెయ్యి ఇచ్చుకోండి'

సాక్షి ఎఫెక్ట్‌..

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): 'రూ. 70 వేలు కావాలా.. రూ.వెయ్యి ఇచ్చికోండి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బీజేపీ స్పందించినట్లు తెలుస్తోంది. పార్టీ మండల బాధ్యులు సోమవారం హాజీపూర్‌ ఎస్సై నరేశ్‌కుమార్‌ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లినట్లు సమాచారం. వసూళ్లపై తగిన విచారణ జరిపేలా చూడాలని విన్నవించినట్లు తెలుస్తోంది.

వసూలు చేస్తోంది బీజేపీ కార్యకర్త కాదు..

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ నిర్వాసితుల నుంచి డబ్బులు వసూలు చేస్తోంది బీజేపీ కార్యకర్త కాదని పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇందుకు తాము ఎలాంటి చర్చకైనా సిద్ధంగా ఉన్నామని, అధికార పార్టీకి చెందిన కొంత మంది తమపార్టీకి చెడ్డపేరు తీసుకు రావాలని చూస్తున్నారని ఆరోపించారు. పార్టీలో ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

భర్తను హతమార్చిన భార్యకు జీవిత ఖైదు

ఆసిఫాబాద్‌: వివాహేతర సంబంధానికి అడ్డుపడుతున్నాడని భర్తకు కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి హతమార్చిన భార్యకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్‌ అధికారి మహ్మద్‌ బషీరొద్దీన్‌ తెలిపారు. రెబ్బెన మండలం లక్ష్మీపూర్‌కు చెందిన చౌదరి శంకర్‌ భార్య రూపకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో జూలై 1, 2019న థమ్సప్‌లో పురుగుల మందు కలిపి హతమార్చింది. మృతుని తల్లి యశోద ఫిర్యాదు మేరకు రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో అప్పటి సీఐ అశోక్‌ కేసు నమోదు చేశారు. 20 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు..!



తవ్విన ఆనవాళ్లు

మందమర్రిరూరల్‌(చెన్నూర్‌): మందమర్రి మండలం పొన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో గల భక్త హనుమాన్‌ విగ్రహం ఎదుట సోమవారం గుప్తనిధుల కోసం తవ్విన ఆనవాళ్లు కనిపించాయి. నాగుల పంచమి సందర్భంగా పుట్టవద్దకు వెళ్లిన భక్తులకు పుట్టకింద సుమారు మూడు మీటర్ల దూరం వరకు చింత చెట్టు వేర్లను నరికివేసి తవ్వినట్లు కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. అంతేకాకుండా విగ్రహం వద్ద మద్యం, వాటర్‌ బాటిళ్లు ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

ధర్మపురి: ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై దత్తాత్రి తెలిపిన ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌ మండలం పెద్దంపేటకు చెందిన ఓ వ్యక్తితో జైనా గ్రామానికి చెందిన గడ్డి జ్యోతికి వివాహమైంది. దంపతులకు ఇద్దరు సంతానం. మహిళ భర్త కరీంనగర్‌లో తాపీమేస్త్రీగా పనిచేస్తుండగా కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నారు. కొంతకాలంగా కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన జ్యోతి తన కుమారుడు, కూతురితో కలిసి పుట్టింటికి జైనాకు వచ్చింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ధర్మపురిలోని గోదావరి నది వద్దకు చేరుకుంది. సంతోషిమాత మెట్ల వద్ద అదోలా ఉండగా గమనించిన భక్తులు డయల్‌ 100 నంబరుకు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై దత్తాత్రి సంఘటన స్థలానికి చేరుకుని వారిని ఠాణాకు తీసుకెళ్లారు. భర్తను రప్పించి ఇద్దరికీ కౌన్సిలింగ్‌ ఇచ్చి ఇంటికి పంపించారు.

కలెక్షన్‌ ఏజెంట్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

ఆసిఫాబాద్‌: కాగజ్‌నగర్‌ మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ సమీపంలో శ్రీరామ్‌ చిట్‌ఫండ్‌ ఫైనాన్స్‌కు చెందిన కలెక్షన్‌ ఏజెంట్‌ ప్రమోద్‌ సింగ్‌పై సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చారు. ఈజ్‌గాంలో డబ్బులు కలెక్షన్‌ చేసుకుని కాగజ్‌నగర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బీరు సీసాలతో దాడిచేసి బ్యాగులో ఉన్న రూ.35 వేల నగదును అపహరించారు. క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కాగజ్‌నగర్‌ రూరల్‌ సీఐ నాగరాజు తెలిపారు.

చిరుత దాడిలో మేక మృతి

వేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని కళ్లెంపల్లి అటవీప్రాంతంలో చిరుత సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వారం రోజుల క్రితం సిడాం లక్ష్మణ్‌కు చెందిన మేకను హతమార్చగా సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలో సిడాం సుధాకర్‌కు చెందిన మేకపై దాడికి పాల్పడింది. మేకల మందతో సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ఊరి సమీపంలోనే మాటు వేసిన చిరుత మేకల మందపై దాడి చేసి ఒక మేకను చంపింది. పది హేను రోజులుగా చిరుత గ్రామ సమీపంలోనే సంచరిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయమై అటవీ అధికారులకు సమాచారం అందించినట్లు బాధితుడు సుధాకర్‌ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జన్నారం: ఈ నెల 18న ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై సతీశ్‌ తెలిపారు. జన్నారం మండలం కవ్వాల్‌ గ్రామానికి చెందిన గొల్లపెల్లి రాజన్న (60) అనే గీత కార్మికుడు వృత్తిలో భాగంగా ఈత చెట్లు గీయడానికి కొత్తపేటకు వెళ్లి తిరిగివస్తుండగా కవ్వాల్‌ గ్రామానికి చెందిన అయూబ్‌ఖాన్‌ ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెనుకనుంచి వచ్చి ఢీకొట్టాడు. ఘటనలో రాజన్నకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.